# సజీవ శిల్పం

నాకు అసలామె కథలో ఉత్సాహం కలిగించిన వాడు గుర్నాధం. ఆ రోజు ప్రొద్దున్నే వరండాలో కూర్చుని గడ్డం గీసుకుంటున్నాను. అప్పుడే ఏదో కొంప ముంచుకుపోయినట్టు వచ్చాడు గుర్నాధం - "నమస్కారం - గురువుగారూ!" అంటూ --

పలకరింపుగా చిన్నగా నవ్వాను. ఆ కాస్త నవ్వుకే గడ్డం తెగి రక్తమొచ్చింది. గుర్నాధం చూడకుండా టవల్‌తో అద్దాను రక్తాన్ని -

నాకెదురుగా కుర్చీ లాక్కుని, కూర్చుని 'మీతో ఓ విషయం చెప్పాలి గురువుగారు!' అన్నాడు.

అతన్ని చూస్తే ఆ రోజెందుకో మంచి ఉత్సాహంగా వున్నాడనిపించింది.

అసలు నాకతనితో పరిచయం అయి సరిగ్గా రెండు నెలలే అయింది. కాని బాగా సన్నిహితుడయ్యాడు. అతను కూడా, నేను పనిచేస్తున్న స్కూల్లోనే కొత్తగా చేరాడు. తేడా మాత్రం నేను తెలుగు మాష్టరుని - అతను డ్రిల్లు మాష్టరు. అతనికి యిరవై నాలుగేళ్ళ వయసు వుంటుంది. అవివాహితుడు. యింత ప్రొద్దున్నే గుర్నాధం రావడంలో ఏదో పెద్ద విశేషమే వుందనిపించింది.

"నేను అద్దెకున్న యింట్లోనే - క్రింది పోర్షన్ ఖాళీగా వుందని తెలుసుగా మీకు. ఆ పోర్షన్లో నిన్న మధ్యాహ్నమే ఎవరో దిగారు!" అన్నాడు గుర్నాధం.

దాంట్లో నాకు విశేషమేం కనపడలేదు. యిళ్లు ఖాళీ అవటం, వెంటనే ఎవరో వచ్చి ఆక్రమించటం, గుంటూరు లాంటి పెద్ద పట్నాల్లో సాధారణంగా జరిగేదే -

"మొగుడూ పెళ్ళాం - చిన్నవాళ్లే, ఆవిడని చూడటానికి రెండు కళ్లు చాలవు గురువుగారు -ఎంత అందంగా వుందనుకున్నారు. తెలుగు వారిలో...."

ఇటువంటి విషయాలు నా భార్య చెవిన పడటం మంచిది కాదు. అందుకే లోపలికి తొంగి చూశాను. చంటాడిని కాళ్ల మీద పడుకోబెట్టుకుని - దొడ్లో నీళ్లుపోయటం - యిక్కడ నుంచి స్పష్టంగా కనపడుతూంది.

"...తెలుగువారిలో అరుదుగా వుండే రోజా రంగు శరీరం ఆమెది - సన్నజాజి తీగలా వుందంటే నమ్మండి - ఆ అందమే కాదు ఆ ఘుమాయింపు కూడా వుంది. ఆవిడ అందం వర్ణించటం నా తరం కాదు. నేనేకాదు - అల్లసాని పెద్దనని పిల్చుకొచ్చినా ఖచ్చితంగా దెబ్బ తింటాడు - ఒక్క మాటలో చెప్పాలంటే ఆవిడ అప్సరసలలో అప్సరస. ఏ ప్రపంచ సుందరి ఆమె కాలిగోటికి సరిపోతుందండీ-" ఆమె రూపాన్ని మళ్లీ తన మనసులోకి తెచ్చుకోటానికి ప్రయత్నం చేస్తున్నాడు కాబోలు గుర్నాధం ఏదో లోకంలో తేలిపోతున్నట్లుగా కనిపించాడు.

గుర్నాధానికి కావలసినవి నా చెవులు - నా నోరు కాదు.

అందుకే నేనేమీ మాట్లాడకుండా, షేవింగ్ సామాను సర్దుతూ కూర్చున్నాను.

"పెళ్లయిన ఒక ఆడదాన్ని నేనిలా వర్ణిస్తున్నానని - నన్నపార్థం చేసుకోవద్దు గురువుగారూ! ఆమె అందం అటువంటిది. ఆమెను చూడగానే మీతో చెప్పాలనిపించింది - చెబుతున్నాను - ఆమె సజీవ శిల్పంలా వుందనుకోండి!" అతని వుత్సాహాన్ని పైకి చెప్పటం కోసం టేబుల్ మీద చేతి వ్రేళ్లతో టకటక లాడించాడు.

"సజీవ శిల్పం అంటే అర్థం తెలుసునా నీకు?" అడిగాను మెల్లగా.

అతనూ నవ్వాడు.

"తెలుగు మాష్టరుని కాకపోయినా ఆ మాత్రం తెలీకపోలేదు సార్ - ప్రాణమున్న ఒక అందమైన శిల్పంలాంటిదే కదా అర్థం !"

నేను మళ్లీ నవ్వాను.

"అంతేనా-లేక ... జీవకళ వుట్టిపడేటట్టు చెక్కిన శిల్పమనా?"

అతనికి ఒక క్షణం అర్థం కాలేదు.

"ప్రాణముండి శిల్పంలాగా అందంగా వుందనా... శిల్పమయివుండీ - జీవకళ వుట్టిపడుతున్నదనా... ఏమో గురువుగారూ - నాకు తెలిసిన కొంచెం తెలుగును గందరగోళం చేస్తున్నారు!" జుట్టు పీక్కున్నాడు గుర్నాథం.

"ఊఁ! సరేలే కానీ... యింతకీ ఆమె సజీవ శిల్పంలా వుందంటావు!" అన్నాను - అతని మాటని ఖండిస్తేగాని అసలు విషయం బయటకు రాదు మరి -

"ఆమె పేరు మాధురి!"

మధురంగానే వుంది - ఒప్పుకోవాలి.

"ఆమె భర్త పేరు జయరాం - అతను అరండేల్‌పేటలో ఏదో బ్యాంకులో పనిచేస్తున్నాడట - అతనికసలు వుద్యోగం చేయవలసిన అవసరంలేదట. ఏడు తరాలవాళ్లు తెగతిన్నా తరగని ఆస్తి వుందట. ఏదో సరదాకొద్దీ - పురుషుడయినందుకు ఆ లక్షణం చూపిద్దామని వుద్యోగం చేస్తున్నాడట! అసలు నాకు వాళ్లతో పరిచయమే వింతగా జరిగింది సార్! నిన్న స్కూలు వదిలిన తర్వాత యింటికి వెళ్లాను. గేటు తీసి లోపలకు అడుగుపెట్టగానే ఆగిపోయాను. మీకు తెలుసుగదా నేను మేడ మీద గదిలో వుంటున్నానని - పైకి వెళ్లే మెట్ల దగ్గర సన్నజాజి తీగ ఒకటి పందిరికి అల్లుకుని వుంది. అక్కడే వున్నది మాధురి. ఒక చిన్న బెంచి వేసుకుని సన్నజాజులు కోస్తున్నది. పమిటి చెంగును చుట్టు తిప్పి, నడుము దగ్గర చీరలో దోపింది- గాలికి చెదురుతున్న ముంగురులు పాలరాతి వంటి ఆమె నుదిటి మీద నాట్యం చేస్తున్నాయి. ఆమె కళ్లల్లో వున్న అందం ... వెలుగు ... అబ్బ - వర్ణించటానికి నా తరం కాదు మాష్టారూ - ఆమె చేతిలో ఒక గిన్నె - గిన్నెలో నీళ్లు, ఆ నీళ్లలో కోసిన సన్నజాజులు పడేస్తున్నది - ఏమీ గమనించకుండా ఏకాగ్రతతో పూలు కోస్తున్నాదామె. అంత అందాన్నీ ఒక్కసారిగా చూసేసరికి - నాకు ఏదో మైకం కమ్మినట్లయింది. ఇంతలో కిటికీలోనుంచి నన్నే చూస్తున్న జయరాం కనపడ్డాడు. నేను సర్దుకుని, మెట్ల వేపు నడిచాను - అంతే! బెంచి ప్రక్కనే నేల మీద

పడగవిప్పి ఆడుతోంది - నల్లటి త్రాచుపాము - అసలు మాకు పరిచయం కావటానికి కారణం అదే సార్! అంతకుముందు నాకు, రెండు మూడుసార్లు కనిపడింది కాని చంపబోతే దొరకలేదు. అంత మంచి అదను మళ్లీరాదు. అందుకే నిశ్శబ్దంగా, పక్కనేవున్న కర్ర తీసుకొని, రెండే రెండు దెబ్బలు వేశాను. ఆమె ఒక్కసారిగా వులిక్కిపడి క్రిందకు దూకింది - చచ్చిన పాముని చూసి కెవ్వుమని కేక వేసింది. ఈ సందడికి జయరాం బయటకు వచ్చాడు. పాముని చూసి జరిగింది గ్రహించాడు. దంపతులిద్దరి కళ్లల్లోనూ కృతజ్ఞత కనపడింది''.

నా భార్య కాఫీ తేవటంచూసి ఆగాడు గుర్నాధం.

కాఫీ అందుకుంటూ, ''నమస్కారం అక్కయ్యగారూ!'' అన్నాడు.

''ఏం తమ్ముడూ - ఈ మధ్య అసలు కనబడటంలేదు!'' అన్నది నా భార్య పార్వతి.

''మావూరి నుంచి మొన్ననే తిరిగి వచ్చానండీ!'' అన్నాడు గుర్నాధం.

పార్వతి కవ్వింపుగా నవ్వింది - ''ఈసారి నచ్చినట్టేనా!'' అంటూ.

అతనికి ముందు అర్థం కాలేదు. కాసేపటికి గ్రహించి, సిగ్గుపడిపోయాడు.

''ఏమిటోనండి - బజార్లో యింతమంది చక్కటి ఆడపిల్లలు కనబడతారా - పెళ్ళి చూపులకు వెడితే అంతా ... ఎందుకులెండి కాలం ఖర్మం కలసిరావాలి!''

పార్వతి వస్తున్న నవ్వుని ఆపుకుంటూ ఇంట్లోకి వెళ్ళిపోయింది.

''నన్ను ఆ రాత్రి వాళ్ళింటికి భోజనానికి పిలిచాడు సార్ జయరాం - నా ఋణం తీర్చుకోలేనన్నాడు - తన భార్య, నేనా క్షణంలో రాకపోతే - పాము కాటుకి చనిపోయేదన్నాడు - యింకా చాల అన్నాడులెండి-''

నిజంగా ఈ సంఘటన జరిగిందో లేదో కాని గుర్నాధం బాగానే వర్ణించాడనిపించింది.

''మీకు యిది తెలుసునా సార్ - జయరాం గొప్ప కవి - ఎన్నో పుస్తకాలు భార్య పేరుతో ప్రచురించాడుట - అంతేకాక అతను బొమ్మలు కూడా చాల బాగా గీస్తాడు. చాల చిత్రాలకి బహుమానాలు కూడా అందుకున్నాడు. అతను నిజంగా అదృష్టవంతుడు. గొప్ప కళాకారుడవటమే కాకుండా, అపూర్వమయిన కళ వుట్టిపడే భార్య వుంది. పైగా భార్యను విపరీతంగా ప్రేమిస్తున్నాడు.''

నేను ఏమీ మాట్లాడలేదు -

''మీరు స్నానం చేయాలి కాబోలు మాష్టారూ, నే వెడతాను. మళ్ళా కలుస్తాలెండి!'' వెళ్ళిపోయాడు గుర్నాధం.

తరువాత నేను ఆ విషయం దాదాపుగా మరచిపోయాను. నాలుగు రోజుల తర్వాత స్టాఫ్ రూంలో కూర్చుని వుండగా వచ్చాడు గుర్నాధం నమస్కారం పెడుతూ.

''మీకు ఆ రోజు చెప్పాను గుర్తుందా గురూగారూ! మాధురిని పువ్వుల్లో పెట్టి పూజచేస్తున్నాడు జయరాం. వాళ్ళింట్లో పనిచేసేది నా రూమ్ కూడా వూడుస్తుంది - అదే చెప్పింది. నడిస్తే పెళ్ళాం కాళ్ళు కందిపోతాయ్ అని బాధపడతాట్ట జయరాం. ఏ పనీ ఆవిడ చేయటానికి వీలులేదట - వంటకి కూడా వేరే ఆడ పనిమనిషిని వుంచాడుట. అతనికి

కావలసినదల్లా ఆమె ఎప్పుడూ తన ముందు కూర్చుని నవ్వుతూ వుండటమేనట. ఆఫీసులేని వేళల్లో - భార్య కళ్ళల్లోకి చూస్తూ కూర్చుంటాడుట - అతని చిత్రాలకు భావావేశం యిచ్చేది మాధురి. అతని కావ్యాలకు కవితావేశం తెచ్చేది మాధురి. ఆమె వల్లనే తన కవితా కన్యగానానికి అడ్డులేదంటాడుట. గానమంటే గుర్తుకు వచ్చింది. మాధురి చాల బాగా పాడుతుందిట - జయరాం ఆమె గానం వింటూ - ఏదో లోకాలలో తేలిపోతాడుట - నిజంగా యింత కళామయమైన జీవితం గడుపుతున్న ఆ దంపతులు ధన్యులు. ఏమంటారు?'' అన్నాడు గుర్నాధం.

ఏమంటాను? కాని ఏదో అనాలి. లేకపోతే గుర్నాధం ఏమయినా అనుకుంటాడు. అందుకని ''కాదూ మరి!'' అన్నాను. నాకూ విచిత్రంగానే వుంది. ఇంత కళారాధకులు - ఇంకా ఈ కాలంలో వున్నారా అని.

యింతలో బెల్ కొట్టటంతో - నేను క్లాసుకు వెళ్ళవలసి వచ్చింది. గుర్నాధంతో క్లాస్ వుందని చెప్పి వెళ్ళిపోయాను.

తర్వాత చాల రోజులు గుర్నాధం కనపడలేదు. అందువల్ల నాకు ఆ కళాజీవుల గురించి ఏమీ తెలియలేదు. వాళ్ళ గురించి యింకా యింకా వినాలనిపించింది. కాని గుర్నాధం కనపడితేనే కాని అది సాధ్యపడదు.

ఆరోజు సాయంత్రం తీరిగ్గా కూర్చున్న కాంపోజిషన్ పుస్తకాలు దిద్దుతున్నాను. పార్వతి వంట ప్రయత్నంలో వుంది. ...పిల్లాడు వంటింట్లో వాళ్ళమ్మ కొంగుపట్టుకుని తిరుగుతున్నాడు. చంటాడు మంచం మీద ఆదమరచి నిద్రపోతున్నాడు.

గేటు చప్పుడయితే అటు చూశాను. నీరసంగా వస్తున్నాడు గుర్నాధం. గడ్డం పెరిగింది. కళ్ళల్లో వుత్సాహం లేదు. వచ్చి మాట్లాడకుండా కూర్చున్నాడు.

''అలా వున్నావే గుర్నాధం?'' అడిగాను కొంచెం ఆశ్చర్యపడుతూ నవ్వుతూ పేలుతూ ఉండే గుర్నాధం గుర్నాధాన్ని ఆ రకంగా చూడటం అదే మొదటిసారి.

''ఏంలేదు గురూ గారూ! ఈ మధ్య బాగా జ్వరం వచ్చింది - ఇవాళే భోజనం చేశాను!' ' అన్నాడు మెల్లగా.

విస్తుపోయాను. '' అదేమిటి గుర్నాధం! మా యింటికి రాకపోయావా, ఒంటిరిగాడివి. నీకక్కడ చేసేదెవరు - అసలు మందేమయినా తినేవాడివా - నీ సంగతి అక్కడ ఎవరు చూసే వారింతకీ -'' ఈ విషయం పార్వతికి తెలిస్తే నన్ను చివాట్లు పెడుతుంది. అతన్ని అంత జ్వరంతో దూరంగా వుంచినందుకు నామీద విరుచుకు పడుతుంది.

''అబ్బే! పెద్ద జ్వరమేమీ కాదు సార్! అదే తగ్గిపోతుందని వూరుకున్నాను. తగ్గకపోగా యిన్నాళ్ళు లాగిలాగి వదిలింది. ఈ మాత్రానికే మిమ్మల్ని శ్రమ పెట్టడమెందుకని వూరుకున్నాను - అయినా మా పనిమనిషి నన్ను జాగ్రత్తగానే చూసుకుంది లెండి - సమయానికి ఆదుకుంది - ఏనాటి రుణమో - '' గుర్నాధం ఈ మాట, అమాయకంగానే అన్నా, నాకు మాత్రం నవ్వు వచ్చింది.

మాధురి గురించి అడుగుదామనిపించింది. ఇంతలో అతనే అన్నాడు.

"గురువుగారూ - మాధురి, జయరాం మనం అనుకుంటున్నంత సుఖంగా జీవించటంలేదు!"

నాకీసారి నిజంగా ఆశ్చర్యం వేసింది. కళాపూరితమైన వారి ఆదర్శ జీవితానికి అడ్డుగోడలా - అదేమిటో తెలుసుకోవాలనిపించింది - నేనతన్ని అదేమిటని అడగనవసరం లేదు. నేనేం మాట్లాడకుండా వుంటే గుర్నాథమే అంతా చెబుతాడు.

"మాధురికి - తనెంత అందంగా వున్నా - మామూలు స్త్రీలాగానే జీవించాలని వుంటుందిట - ఆమెకి యింటిని చక్కబెట్టుకోవాలని స్వయంగా వంటచేసి భర్తకు వడ్డించాలని కోరికట పిల్లల్ని కని - తన చేతులతో పెంచి, పెద్దచేయాలని కలలు కంటుండేదిట. కాని జయరాం - ఆమె సాధారణ స్త్రీ కాదనీ, మామూలుగా జీవించవలసిన ఖర్మ ఆమెకేమీ లేదనీ వాదిస్తాట్ట. అన్నింటికీ పని మనుషుల్ని పెట్టాడుట. ఆమె కాలు కదపనక్కరలేకుండా, పనులన్నీ జరిగే ఏర్పాట్లు చేశాడుట. కాని ఆమెకి మాత్రం తృప్తిగా లేదు."

ఒక క్షణం ఆగి అటూ, యిటూ చూసి మెల్లగా అన్నాడు.

"యింకో విషయం సార్! ఆమె శరీరం ఎక్కడికక్కడ జున్ను ముక్కలు పెట్టి అతికినట్టుగా - ఏ శిల్పికీ అందనంత అద్భుతంగా వుంటుంది. కాన్పులతో ఆమె చితికిపోతుందనే భయం కూడా అతనికి వుంది - అందుకే యిద్దరికి వేరు వేరు మంచాలు వేయించాడుట. అంతేకాదు - తన మీద - తనకి ఎక్కడ కంట్రోల్ పోతుందో అన్న వుద్దేశ్యంతో అతను ఆపరేషన్ కూడా చేయించుకున్నాడుట - ఆమెకు పిల్లలంటే అపరిమితమైన ప్రేమ - ఇతను ఆపరేషన్ చేయించుకుంటానంటే - ఆమె యితని కాళ్ళు పట్టుకుని బ్రతిమలాడిందిట - పిల్లలు లేనిదే తను బ్రతుకలేనని గోల పెట్టిందిట - అయినా జయరాం వినలేదు. అతనికి "మరో జన్మ" మీద నమ్మకం లేదు - ఈ జన్మలో హాయిగావుంటే చాలంటాడు. ముసలి వాళ్ళయిన తర్వాత కూడా ఏమీ భయంలేదు - మన డబ్బుతో హాయిగా గడపవచ్చు అంటాడుట జయరాం. ఆమెలో మాత్రం ఏదో అసంతృప్తి. ఈ మధ్య ఆమె ఏ మాత్రం హుషారుగా వుండటంలేదు - ఎప్పుడూ ఏదో ఆలోచిస్తుంటుంది. ఆమె అందమైన పెదవుల మీద చిరునవ్వు అసలే లేదు!"

ఎంతో అందంగా మొదలైన ఈ కథ ఏ విధంగా అంతమవుతుందా అనిపించింది నాకు.

"నాకు జ్వరమొచ్చిందని తెలిసి పాలూ, పళ్ళూ పంపించింది ఒక రోజు నేనే వద్దన్నాను బాగుండదని. ఆమె చిన్నబుచ్చుకున్నదో ఏమో - నేనేమయినా తప్పు చేశానా గురువుగారూ?'' అడిగాడు గుర్నాథం.

కాంపోజిషన్ పుస్తకం మీద ఎర్ర యింకుతో గీతలు గీస్తున్నాను. "ఆమె నీకు పాలూ, పళ్ళూ పంపించటంలో తప్పు ఏమాత్రం లేదు. ఆమెకు నువ్వు ప్రాణదానం చేశావు. నీకు వంట్లో బాగులేనప్పుడు ఆమె సహాయం చేయటం ధర్మం. నువ్వు అవి త్రిప్పికొట్టడం మాత్రం తప్పే!"

గుర్నాథం కాసేపు మాట్లాడలేదు.

ఉన్నట్టుండి "నే వెడతాను సార్!" అన్నాడు లేస్తూ.

"ఉండు గుర్నాథం - నువ్వు పూర్తిగా కోలుకునేదాకా మా యింట్లోనే వుండు - లేకపోతే మీ అక్కయ్య నన్ను చివాట్లు పెడుతుంది!" అన్నాను.

"వద్దు సార్! అదే పోతుంది - వస్తా - మళ్ళీ కలుస్తాలెండి!" వెళ్ళిపోయడు గుర్నాథం.

మర్నాడు టెలిగ్రాం వచ్చింది - పార్వతి వాళ్ళ నాన్నకి సీరియస్‌గా వుందని సెలవు పెట్టి నేనూ, పార్వతీ, పిల్లలూ హైదరాబాద్ ప్రయాణమయ్యాము. ఆయన పరిస్థితి ఏమంత బాగులేదు. మరో దిక్కులేనందున, నేనే ఆయనకు తగ్గేదాక దాదాపు నెలా పది రోజులు, అక్కడ వుండవలసి వచ్చింది. ఆయన నెమ్మదిగా కోలుకునేసరికి హైదరాబాద్‌లోనే మా వాళ్ళమ్మాయికి పెళ్ళి నిశ్చయమయింది. మరో పదిహేను రోజులు ఆగి, అదీ చూసుకుని, గుంటూరు వచ్చాము. స్కూలుకి సెలవులు యివ్వటం వలన గుర్నాథం అసలు గుంటూర్లోనే వున్నాడో లేడో కూడా తెలియటం లేదు. మనసులో మాధురి, జయరాంల విషయమేమిటో తెలుసుకోవాలని ఆత్రుతగా వుంది. అలాగే ఒక పదిహేను రోజులు గడిచిపోయినాయి.

యిక వుండబట్టలేక - ఒక రోజు ప్రొద్దున్నే గుర్నాథం రూముకి బయల్దేరాను. బ్రాడీపేట నాలుగో లైన్‌లో వుంటున్నాడతను.

తలుపు తీసి లోపలికి అడుగుపెట్టాను. ఒక యువకుడు పడక్కుర్చీలో పడుకుని వున్నాడు. అతనే జయరాం అయివుండాలనుకున్నాను.

మేడమీద గుర్నాథం రూమ్ తెరచివుండటం చూసి ఆశ్చర్యపోయాను. అయితే యిన్నాళ్ళూ గుర్నాథం వూళ్ళోనే వున్నాడన్నమాట.

మంచంమీద బోర్లాపడుకుని వున్నాడు గుర్నాథం.

అతని వీపు మీద చేయి వేస్తూ "గుర్నాథం!" అని పిలిచాను.

ఉలిక్కిపడి లేచి కూర్చున్నాడు గుర్నాథం. అతని కళ్లు ఎర్రగా వుబ్బివున్నాయ్. తనలో తనే గొణుక్కుంటున్నాడు.

"ఏమిటి గుర్నాథం - అలా వున్నావ్?" అన్నాను అతని జుట్టు నిమురుతూ.

అమాంతం నన్ను కావలించుకుని - ఒక్కసారిగా బావురుమని ఏడ్చాడు గుర్నాథం.

నాకేం అర్థం కాకపోగా, అయోమయంగా వుంది.

"ఏమిటి గుర్నాథం - ఏమియింది?" అన్నాను.

"మీరు చెప్పండి సార్ - నేనలాటివాడినా?" అన్నాడు గుర్నాథం చిన్నపిల్లవాడిలా.

"అసలేం జరిగింది - నాతో చెప్పు" లాలించాను గుర్నాథాన్ని - పార్వతి మా చంటాడ్ని లాలించినట్టు.

ఒక నిముషం ఆగి అన్నాడు గుర్నాథం.

- "మాధురి యిప్పుడు గర్భవతి" అని.

గుండె ఆగినంత పనయింది నాకు. మాధురి గర్భవతా!

“వేరువేరుగా పడుకునే వాళ్ళన్నావ్. పైగా అతను ఆపరేషన్ కూడా ...” సణిగాను మెల్లగా.

“అందుకనే నన్ననుమానిస్తున్నాడు సార్ జయరాం - మీరు చెప్పండి సార్ నేనలాంటివాడినా ...” గుర్నాధానికి ఏడుపు ఆగలేదు. మళ్ళీ భోరుమన్నాడు.

గుర్నాధం డ్రిల్లు మాష్టారవడం వల్ల శరీరం పెంచాడేకాని స్వాభావికంగా అతను పసివాడు, అమాయకుడు.

“నీ గురించి నాకు తెలీదూ గుర్నాధం - నీలో నాకాపాటి నమ్మకం వుందిలే - అయినా అతను నిన్ను అనుమానించటం ఏమిటి - బుద్ధి లేకపోతేసరి - పెళ్ళాన్ని పెళ్ళాంగా చూడక కవితా కన్యనీ, కాకరకాయనీ కాలం గడిపితే ఏ పెళ్లాం వూరుకుంటుంది. వాడికి తగిన శాస్తి అయిందిలే... వాడినసలు నువ్వు కేర్ చేయకు!” అన్నాను కొంచెం కోపంగా.

ఎందుకో జయరాం అంటే ఆ క్షణంలో అసహ్యం వేసింది.

“కాని... ఆమె అటువంటిది కాదు సార్ .... చాల మంచిది...” అన్నాడు గుర్నాధం తేరుకుంటూ.

మరి గుర్నాధం పసివాడు కాదూ? - అంత కోపంలోనూ నవ్వు వచ్చింది.

“గుర్నాధం! ఏదయినా జరిగివుండవచ్చు - ఏ ఆడదీ అలా వూహల్లో బ్రతకలేదు - జీవితాన్ని సరిఅయిన పంధాలో అనుభవించాలనే కోరిక ఆమె ఓర్పును మించివుంటుంది - పరిస్థితులకు లొంగక తప్పదు. ఒక వేళ ఆమె దానికీ అతీతురాలయితే - నువ్వు చెప్పావ్ గదా - అతను ఆపరేషన్ చేయించుకున్నాడని - ఆ ఆపరేషన్లు ఫెయిలయిన కేసులు కూడా నాకు తెలుసు - అదే కారణం ఎందుకు కాకూడదు -”

ఆ మాట విని “అయితే అయివుండవచ్చు - అటువంటి ఆపరేషన్స్ ఫెయిలవుతున్నవని నేనూ విన్నాను-” అన్నాడు గుర్నాధం . అటుండగా అతని ముఖం వికసించింది కూడా.

“గుర్నాధం - నువ్వేవేం పట్టించుకోకు! మా యింటి దగ్గర ఒక గది ఖాళీ అయింది. అక్కడికి మారు - వెంటనే మీ వూరికి వెళ్ళి పెళ్ళి చేసుకో - అన్ని గొడవలూ మర్చిపోతావ్ - జయరాం యిక నీ మీద ఏ అభాండాలు వేయడు. అతనికీ తెలుసు - అభాండాలే తన సంసారాన్ని కూడా చితకకొడతాయని- ఏదో గుట్టుగా కాపురం చేస్తూ యికనయినా బాగా వుంటాడు”.

అతన్ని ఓదార్చి బయటకు నడిచాను.

మెట్లు దిగుతుండగా కనపడిందామె. నిజంగా అపురూప సౌందర్యవతే! గుర్నాధం చెప్పిన దానికన్నా ఎన్నో రెట్లు అందంగా వుంది.

నన్ను చూసి - తల వంచుకుని - చకచకా లోపలకు వెళ్ళిపోయింది.

ఆ రోజు గుర్నాధం ఆమెను సజీవ శిల్పం అన్నాడు - అంటే అర్ధం జీవకళ పుట్టిపడేటట్టు చెక్కిన శిల్పమనా - లేక ప్రాణం వుండి శిల్పంలా జీవిస్తున్నదనా -

ఏమో! తెలుగు మాష్టరు నయినా నాకామాటకి ఆ క్షణాన అర్ధం తెలియలేదు. ❀